



చిట్టేడులో పురాతన శాసనం

కోట మండలం చిట్టేడు గ్రామంలోని చిట్టేటమ్మ ఆలయానికి సంబంధించిన 15వ శతాబ్దంనాటి శాసనం వెలుగు చూసింది.గ్రామస్తుల ఆహ్వానం మేరకు గూడూరు ఎస్కేఆర్ కళాశాల చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ గోవిందు సురేంద్ర, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సీనియర్ ఫెలోషిప్ డాక్టర్ మమత ఈ శాసనాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందు సురేంద్ర మాట్లాడుతూ... 15వ శతాబ్దానికి చెందిన చిట్టేడు గ్రామ పాలేదారుల వంశానికి చెందిన లింగమ నాయుడు కుమారుడు కృష్ణప్ప నాయుడి పెద్ద సోదరి లక్ష్మమ్మ వేయించిన శాసనంగా గుర్తించారు.దీనిపై చిట్టేటమ్మ ఆలయ నిర్మాణం, కోనేరు, మండపానికి సంబంధించిన విషయాలున్నాయన్నారు. ఈ శాసనం సంస్కృత భాష, ప్రాచీన తెలుగులిపిలో మొత్తం 16 పంక్తులతో శంఖుచక్ర, సూర్యచంద్ర నామాల గుర్తులతో ఉందన్నారు. - కోట

తిరుమలలో గరుడసేవ



తిరుమల క్షేత్రంలో శుక్రవారం రాత్రి గరుడవాహన సేవ కన్నులపండువగా జరిగింది. గరుడపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడిడిపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో శ్రీవారు ఊరేగారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి



రావి,వేప చెట్లకు కల్యాణోత్సవం

ఎర్రావారిపాలెం మండలం కమ్మళ్ళ కూడలి సమీపంలోని రావి , వేప వృక్షాలకు శుక్రవారం ఉదయం కల్యాణం జరిపించారు.కమళ్ళయ్యగారిపల్లెకు చెందిన వాసు చాలా సంవత్సరాలుగా గ్రామస్తులతో కలిసి రావి, వేప చెట్లకు పెండ్లి జరిపిస్తున్నారు. ఈ క్రమంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఉదయం పురుషోత్తం, అరుణ దంపతులు వరుడి కుటుంబం(రావి) తరపున, జయరామయ్య, గీత దంపతులు వధువు (వేప)కుటుంబం తరపున పట్టు వస్త్రాలు ధరించి పెండ్లి పీటలపై ఆశీనులయ్యారు.వేదపండితులు సాయి వర్మ కళ్యాణ తంతు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులకు విందు భోజనం వడ్డించారు.

- ఎర్రావారిపాలెం

నిమ్మ ధర అదిరింది



గూడూరు మార్కెట్‌లో నిమ్మకాయల ధరలు ఊపందుకున్నాయి. కొద్ది రోజులుగా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం కిలో నిమ్మకాయలు అత్యధికంగా రూ.140పలికాయి. టిక్కీ బస్తా(50 కిలోలు) ధర రూ.7 వేలు,పండ్లు, పొడికాయలు సైతం టిక్కీ బస్తా ధర రూ.3 వేలు పలకడంతో రైతు, వ్యాపార వర్గాల్లో సంతోషం వ్యక్తమైంది.కాయలు మార్కెట్‌కు తక్కువగా రావడం, శ్రావణ మాసం నడుస్తుండడంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో డిమాండ్ పెరగడంతో నిమ్మధరలకు ఊపొచ్చినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

- గూడూరు అర్బన్

డాక్టర్ సీఆర్‌రెడ్డి జీవిత ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే సునీల్‌కుమార్,డాక్టర్ సీఎంకే రెడ్డి తదితరులు →



సంపదను పంచడంలోనే ఆనందం

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

గూడూరు, ఆగస్టు 9 : మన సంపాదనలో కొంతభాగాన్ని సమాజానికి పంచడంలోనే నిజమైన ఆనందం వుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యా నాయుడు అన్నారు. శుక్రవారం గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు అల్లారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి,డాక్టర్ సీఆర్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు.అనంతరం డాక్టర్ సీఆర్‌రెడ్డి జీవిత ప్రస్థానం పుస్తకాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ గూడూరులో మహిళలు విద్యలో రాణించేందుకు స్నేహితులైన శ్యామ్‌సుందర్ రెడ్డి, సీఆర్‌రెడ్డి 1980వ సంవత్సరంలో దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలను స్థాపించి ఉన్నతస్థాయికి తీసుకురావడం సంతోషదాయకమన్నారు.ఈ కళాశాల వేలాదిమంది మహిళల జీవితాలకు ఉన్నత బాట చూపిందన్నారు.ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నతచదువుతోనే ఉజ్వల భవిష్యత్తుంటుందన్నారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆశయాలను కళాశాల యాజమాన్యం ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు.అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి, డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్దన రెడ్డి, డాక్టర్ మెహర్‌మణి, హనుమంతరావు, బి.సురేంద్రరెడ్డి, సుధీర్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, రమణబాబు, ముని గిరీష్ పాల్గొన్నారు.

19న శ్రీసిటీకి సీఎం?

సత్యవేడు, ఆగస్టు 9: సీఎం చంద్రబాబు ఈ నెల 19న శ్రీసిటీ పర్యటనకు విచ్చేయనున్నట్లు సమాచారం. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఇటీవల సీఎంను కలిసి ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండీ, ఇతర అధికార ప్రతినిధులతో కలిసి చంద్రబాబు పర్యటించనున్న డైకిన్ పరిశ్రమను పరిశీలించారు.

పలువురు సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 9: పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ షామోషి ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి క్రైం సీఐ కళా వెంకటరమణను ట్రాఫిక్‌కు, కర్నూలు వీఆర్‌లో వున్న డి. గోపిని శ్రీకాళహస్తి వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో వున్న ఎస్‌వీ నరసింహారావును తిరుపతి వీఆర్‌కు పంపారు. కమాండ్ కంట్రోలులో పనిచేస్తున్న బీవీ శ్రీనివాసులును శ్రీసిటీకి, సీఐడీలో పనిచేస్తున్న కిషోర్‌బాబును గూడూరు రూరల్‌కు, వెంకటగిరిలో పనిచేస్తున్న సంగమేశ్వరరావును నాయుడుపేట రూరల్‌కు, ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న ఎ.వెంకట్రమణను వెంకటగిరికి బదిలీ చేశారు.రేణిగుంట, గాజులమండ్యం సీఐలు మల్లికార్జున్, సుబ్బరాయుడులను వీఆర్‌కు పంపారు. తిరుపతి మహిళా పీఎస్‌లో వున్న శరత్‌చంద్రను రేణిగుంటకు,తిరుపతి సీసీఎస్‌లో వున్న మురళీకృష్ణను గాజులమండ్యం స్టేషన్‌కు, కల్యాణీడ్యాం పీటీసీలో వున్న ఎం.మురళిని సత్యవేడుకు బదిలీ చేశారు.

పంద్రాగస్టున మంత్రి ఆనం పతాకావిష్కరణ

తిరుపతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగే జిల్లాస్థాయి వేడుకల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎవరికీ మంత్రి పదవులు దక్కని సంగతి తెలిసిందే. దీంతో స్వాతంత్ర్య దిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎవరు హాజరవుతారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. దీనికి తెరదించుతూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం జిల్లాల వారీగా స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొనే మంత్రుల జాబితాను ప్రకటించింది.మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తిరుపతిలో జరిగే వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

అమ్మవారి ఆలయంలో 16న వరలక్ష్మీ వ్రతం

తిరుచానూరు, ఆగస్టు 9: తిరుచానూరు పద్మావతీ దేవి ఆలయంలో 16వ తేదీ వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలోని ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నారు.వ్రతంలో పాల్గొనే గృహస్థులకు ఒక ఉత్తరీయం, రవికె, లడ్డూ, వడ ఇవ్వనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారు స్వర్ణ రథంపై ఆసీనులై నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. వ్రతం కారణంగా శుక్రవారం ఆలయంలో ఆర్జితసేవలైన అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, వేదాశీర్వాదం, బ్రేక్ దర్శనం, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఆకట్టుకున్న భీష్మ జననం



భాగవతారిణి అనసూయ - అన్నదానం

రామచంద్రాపురం, ఆగస్టు 9: రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా భగవతారిణి అనసూయ శుక్రవారం వినిపించిన భీష్మ జననం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం బ్రహ్మర్షి పీఠం నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాల నడుమ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది.

సహస్ర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

మంగళం, ఆగస్టు 9: మంగళం ఆర్టీవో కార్యాలయం కూడలిలో సహస్ర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మేయర్ శిరీష, నాయకులు వూకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, పెద్దప్ప (మబ్బు దేవనారాయణరెడ్డి), భానుప్రకాష్‌రెడ్డి, నరసింహ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సహస్ర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వూకా శబరీష్ మాట్లాడారు. అనుభవజ్ఞులైన వైద్యులతో అధునాతన సౌకర్యాలు, అత్యాధునిక పరికరాలతో ఆస్పత్రిని నిర్మించడం జరిగిందన్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, లాప్రోస్కోపీ సర్జరీ, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పీడియాట్రీషియన్, డెర్మటాలజీ వంటి విభాగాల్లో నిపుణులైన వైద్య బృందాలు ఆస్పత్రిలో ఉన్నాయన్నారు. ఇమేజింగ్ అండ్ ల్యాబ్ సర్వీసెస్, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, 24గంటల అత్యవసర వైద్యసేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శారద, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, నరసింహాచారి, చంద్రగిరి టీడీపీ ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, శారద ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైటర్ నారాయణ, కేఆర్ గ్రూప్స్ ప్రొప్రైటర్ కిషోర్ (నాని), తదితరులు పాల్గొన్నారు.

సాయి సద్గురు ఫ్యూయల్ స్టేషన్ ప్రారంభం



ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులను సన్మానిస్తున్న సరితా, రమణమూర్తి దంపతులు

చంద్రగిరి, ఆగస్టు 9: చంద్రగిరి మండలం కల్‌రోడ్డుపల్లె సమీపంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన సాయి సద్గురు ఫ్యూయల్ స్టేషన్ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని ఐతేపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి ఈ ఫ్యూయల్ స్టేషన్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేతోపాటు ఆయన సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్ విచ్చేశారు. వీరికి తన సతీమణి మాజీ జడ్పీటీసీ సరితతో కలిసి ఏవీ రమణమూర్తి, ఐతేపల్లె ఎంపీటీసీ ఏసీ శేఖర్ దంపతులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, టీడీపీ నాయకులు వలపల దశరథనాయుడు, లోకాద్రినాయుడు, బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, చెంచయ్యనాయుడు, అగరాల జయచంద్రారెడ్డి(జేసీ ఆర్), ఉస్మాన్, బెల్లంకొండ రమేష్‌రాయల్, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర నాయుడు



ప్రభాకర నాయుడిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రాపురం, ఆగస్టు 9: మండలంలోని కమ్మపల్లె గ్రామానికి చెందిన ప్రభాకర నాయుడిని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్సీపురంలో శుక్రవారం ప్రభాకర నాయుడిని బీజేపీ నాయకులు సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జనార్దన్‌నాయుడు, నాయకులు శివశంకర్‌రెడ్డి, గోపీనాథరెడ్డి, ప్రసాద్, మునెయ్య, చండికేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జెండా పండుగపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 9: స్వాతంత్ర్య దిన సంబరాలకు ముందుగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని ఎంఈవో-2 సతీష్ ఆదేశించారు. రాజ్యాంగ విలువలు, పర్యావరణం, స్థానిక సంస్థల పాలన అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిపించి, బహుమతులు అందించాలని సూచించారు. పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.అలాగే ఈనెల15న స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణరంగ నిపుణులు, పారిశుధ్య సేవకులను సత్కరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి ఈమేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

అర్బన్ పీహెచ్‌సీని సందర్శించిన డీఎంపీవో

తిరుపతి రూరల్, ఆగస్టు 9: ఎంఆర్‌పల్లెలోని అర్బన్ పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు సందర్శించారు. ప్రతి సోమవారం గైనకాలజిస్ట్ అందుబాటులో ఉంటున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. వచ్చేనెలలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృంద ప్రతినిధులు కేంద్రాన్ని సందర్శించనున్నారని, మౌలికవసతులు, ట్రీట్‌మెంట్ వంటి అంశాలను పరిశీలించి స్కోరింగ్ ఇస్తారన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓం శక్తి అమ్మవారి సేవలో ఆరణి



తిరుపతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె సమీపంలోని ఓం శక్తి అమ్మవారిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇతర నేతలు దర్శించుకున్నారు. తమిళ మాసం (ఆడి నెల)లో ఓం శక్తి అమ్మవారికి గంజి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు ఎన్డీఏ కూటమి నేతలను ఆలయ కమిటీ ఆహ్వానించగా వారొచ్చి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వెయ్యి చీరలను భక్తులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. టీడీపీ నేతలు మబ్బు దేవనారాయణ రెడ్డి, మహేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు ఓం శక్తి అశోక్, గంగాధరం, మణిరాజు, సుబ్రహ్మణ్యం, ముత్తు, కుప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంబీయూలో స్నాతకోత్సవం

చంద్రగిరి, ఆగస్టు 9: ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం (ఎంబీయూ)లో ఆదివారం ఉదయం విద్యార్థుల ప్రథమ స్నాతకోత్సవం, ఇంజనీరింగ్ కళాశాల 13వ పట్టభద్రుల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, ఎంఎస్సీ పూర్తి చేసుకున్న 323 మంది పీజీ విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నారు. శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రులైన బీటెక్ విద్యార్థులు 1,538 మంది పట్టాలు అందుకోనున్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విచ్చేయనున్నారు. ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు అధ్యక్షత వహిస్తారు.విశిష్ట అతిథులుగా ఎంబీయూ ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి,వైస్‌ఛాన్సలర్ ఆచార్య నాగరాజరామారావు, శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎం సతీష్, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి పాల్గొంటున్నారు.

మా కుటుంబాలను రోడ్డున వేయొద్దు

● మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోండి ● కలెక్టరేట్ ఎదుట ఎస్పీవోల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 9: 'మా కుటుంబాలను రోడ్డున వేయొద్దు.. మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకుని ఆదుకోండి' అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీవోలు) వేడుకున్నారు. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన స్పెషల్ పోలీసులు శుక్రవారం తిరుపతిలోని యూత్ హాస్టల్లో సమావేశమయ్యారు. అనంతరం అక్కడినుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వర్షం కురుస్తున్నా కూడా ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ధర్మచందు మాట్లాడుతూ.. జీవో నెంబరు 111 ప్రకారం మాజీ ఆర్మీ జవానులు, సివిల్ వ్యక్తులతో కలిపి ఏపీ స్పెషల్ ఆఫీసర్స్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా 2,156 మందిని పోలీసు శాఖకు అనుసంధానంగా గత ప్రభుత్వం నియమించిందని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో రాత్రీపగలు విధులు నిర్వహించి.. ఎర్రచందనం, మద్యం, గంజాయి తదితరాల అక్రమ రవాణాను నిరోధించామన్నారు. అయినా గత ప్రభుత్వం 18 నెలలుగా జీతాలు చెల్లించలేదని వాపోయారు. జీతాల కోసం ఆందోళన చేయాలనుకుంటే అప్పటి ప్రభుత్వ పెద్దలు మాయ మాటలుచెప్పి విరమింపజేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు.. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తమ సమస్యలను అనేక వేదికలపై ప్రస్తావించారని, అధికారంలోకి వస్తే ఆదుకుంటామన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్నట్టుండి తమను విధులనుంచి తొలగించారన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నారా లోకేష్ తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ధర్నా సందర్భంగా తిరుచానూరు పోలీసులు కలెక్టరేట్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. కలెక్టరేట్‌లోకి కేవలం ముఖ్య నాయకులను మాత్రమే అనుమతించారు. కార్యక్రమంలో సుమారు 150 మంది ఎస్పీవోలు పాల్గొన్నారు.

పాడిపేట వద్ద ఇసుక వివాదం

పంటపొలాల్లో ఎత్తివేస్తున్నారని వైసీపీ ఆరోపణ



ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

తిరుచానూరు, ఆగస్టు 9: తిరుపతి రూరల్ మండలం పాడిపేట సమీపంలో సర్వేనెంబరు 464 పట్టా పంట పొలాల్లో టీడీపీ నేతలు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని వైసీపీ సర్పంచ్ ధనముని, కొంతమంది ఆ పార్టీ నేతలు, స్థానికులు ఆరోపించారు. ఈ మేరకు పంట పొలాల్లో ఇసుక ఎలా తరలిస్తారని శుక్రవారం తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాలుగా విడిపోయి వాగ్వాదం చేసుకున్నారు. అయితే ఈ సర్వే నెంబరు స్థలం తనదేనని.. కొంతమంది ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని విశ్రాంత డీపీఆర్వో శంకర్‌రెడ్డి అమెరికా నుంచి వీడియో విడుదల చేసినట్లు తెలిసింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు ఈ సర్వే నెంబరుతో పాటు చుట్టుపక్కల భారీగా ఇసుకను తరలించినట్లు ఆరోపణలున్నాయి. తిరుచానూరు, పాడిపేట గ్రామాల మధ్య ఉన్న స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇసుక నిక్షేపాలు కూడా ఎక్కువగా ఉండటంతో కొంతమంది భూములు తమవంటే తమవంటూ కొంతకాలంగా గొడవ పడుతున్నారు. ఇకనైనా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌ను స్థానికులు కోరుతున్నారు. గతంలో కూడా తిరుచానూరు, పాడిపేట ప్రాంతాల్లో వైసీపీ ఇసుక మాఫియా రెచ్చిపోయి మరీ బహిరంగంగా ఇసుకను తరలించింది. అధికారులు జోక్యం చేసుకుని ఇసుక వివాదానికి తెరదించాల్సిన అవసరం ఉంది.

అమ్మవారి ఆలయం వద్ద తప్పిపోయిన చిన్నారి



గౌతమ్

తిరుచానూరు, ఆగస్టు 9: పద్మావతి అమ్మవారి దర్శనానికి కర్ణాటక రాష్ట్రం పావగడకు చెందిన నవీన్‌కుమార్ కుటుంబ సమేతంగా వచ్చారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే సమయంలో శుక్రవారం సాయంత్రం అతనికుమారుడు గౌతమ్ (8) గేటు నెంబరు మూడు వద్ద తప్పిపోయాడు. ఆలయ పరిసర ప్రాంతాల్లో వెతికినా బాలుడి ఆచూకీ తెలియకపోవడంతో తిరుచానూరు పోలీసులకు బాధిత కుటుంబం ఫిర్యాదు చేసింది. బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు నిధుల పెంపు

వరదయ్యపాళెం, ఆగస్టు 9: పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు పెంచినట్లు ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో రూ.100, రూ.250 ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.10వేలు, రూ.25వేలకు పెంచినట్లు తెలిపారు. 5వేల జనాభా లోపున్న పంచాయతీలకు రూ.10వేలు, అంతకు మించివున్న పంచాయతీలకు రూ.25వేలు అందిస్తారన్నారు. అదే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఏ విధంగా నిర్వహించాలో మార్గదర్శకాలనుకూడా విడుదల చేశారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రాజ్యాంగ విశిష్టత, ఆగస్టు 15 విశిష్టత, స్థానిక సంస్థల పాలన వంటి అంశాలపై వ్యాసరచన, క్విజ్, డిబేట్ వంటి పోటీలతో పాటు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులతో పాటు రక్షణ రంగం నుంచి వచ్చిన వారిని, పారిశుధ్య కార్మికులను సత్కరించాలన్నారు.

ఏసీ సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, ఆగస్టు 9: చంద్రగిరి పట్టణంలోని ద్వారకానగర్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 14వ తేదీనుంచి 30 రోజుల పాటు పురుషులకు రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషినింగ్ సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం కార్డు ఉన్న తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19-40 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం సౌకర్యం ఉంటుందని, ఒక్కో బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 79896 80587, 94949 51289, 63017 17672 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ బడులకు 'అగస్థ్య' చేయూత



డీఈవోకి సూచికను అందజేస్తున్న ప్రతినిధులు

తిరుపతి(విద్య), ఆగస్టు 9: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉచితంగా అదించేందుకు ఆగస్థ్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ముందుకొచ్చిందని డీఈవో శేఖర్ వెల్లడించారు. శుక్రవారం అగస్థ్య ప్రతినిధులు చరంత్, వీరేష్ కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో తనను కలిసి చర్చించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఆగస్థ్య ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను అందజేస్తుందని చెప్పారు. గణితం, సైన్స్‌లోని కష్టతరమైన అంశాలను సులభంగా బోధించేందుకు ఈ పరికరాలు ఉపాధ్యాయులకు చాలా ఉపయోగపడతాయని వెల్లడించారు. జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు త్వరలోనే ఫౌండేషన్ ద్వారా శిక్షణ ఇప్పించి.. తరగతి గదిలో అమలు చేస్తామని వివరించారు.

టీటీడీ పాలక మండలిలో జ్యోతిర్మయికి అవకాశమివ్వండి



మీడియాతో మాట్లాడుతున్న తాళ్లపాక గ్రామస్తులు

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 9: కొండవీటి జ్యోతిర్మయికి టీటీడీ పాలక మండలిలో సభ్యురాలిగా అవకాశం కల్పించాలని తాళ్లపాక గ్రామానికి చెందిన శివలక్ష్మి, వనజ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తిరుపతి, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో అన్నమయ్య వారసురాలిగా ఆయన సంకీర్తనలను, శ్రీవారి కీర్తి ప్రతిష్ఠలను గ్రామ గ్రామాలకు తెలియజేస్తూ.. వేల మందిని ఆధ్యాత్మికత వైపు నడిపించిన గొప్ప వ్యక్తి జ్యోతిర్మయి అన్నారు. అలాగే రైతులకు, మహిళా భక్తులకు నిత్యం అండగా ఉంటున్నారని చెప్పారు. ఇటువంటి వారికి టీటీడీ పాలక మండలిలో అవకాశం కల్పిస్తే శ్రీవారి విశిష్టతలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళతారన్నారు. లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ దోపిడీని వ్యతిరేకించండి: ఏఐటీయూసీ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 9: కేంద్ర ప్రభుత్వ సహకారంతో కార్పొరేట్లు దోచుకొంటున్న సంపదలో 10శాతం పేదలకు పంచాలని ఏఐటీయూసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న అంబేడ్కర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం క్విట్‌ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ల దోపిడీకి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇలాంటి పాలకులకు తగిన గుణపాఠం చెప్పడానికి కార్మికులు ఐక్యమత్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. నాయకులు సి.పెంచలయ్య, జె.విశ్వనాథ్, శ్రీరాములు, వైఎస్ మణి, ఎస్.శివ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

వయనాడ్‌లో 5వేలకు మందికి పైగా మృతి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 9: 'వయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యానికి మృతి చెందినవారు 500మంది అని అక్కడి ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోంది. రెండు గ్రామాలకు చెందిన 5వేలకు మందికిపైగా మృతి చెందారన్న మాట వాస్తవం' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పక్క రాష్ట్రంలోని బాధితులకు మన ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. ఇందుకుగాను టీటీడీలో భక్తులు కానుకలుగా ఇచ్చిన వేలకోట్లలో రూ.10కోట్లు సాయంగా అందించాలని, ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ సానుభూతి, సాయాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక రాష్ట్రంలో ఓబీసీలు పూర్తిగా వెనుకబడ్డారని, వాళ్లకు ఇచ్చే రిజర్వేషన్లు కూడా మరో ఐదేళ్లలో తొలగించే విధంగా కుట్రలు జరుగుతున్నాయన్నారు. సుప్రీంకోర్టులో 34 మంది జడ్జీల్లో కేవలం ముగ్గురు మాత్రమే ఓబీసీలు ఉన్నారని.. మిగిలినవారు వారసత్వంగా ఆ స్థానంలో కొనసాగుతున్నారని ఆరోపించారు. కొంత కాలంగా పరిశీలిస్తే కేవలం 250 కుటుంబాలకు చెందినవారు మాత్రమే సుప్రీంకోర్టు జడ్జీలుగా కొనసాగుతున్నారన్నారు. వీరిలో ఏ ఒక్కరు కూడా ఇంతవరకు ఎస్సీ కాలనీలకు వెళ్లి వారితో మాట్లాడిన దాఖలాలు లేవని చెప్పారు. దీనికిముందు ఆయన టీటీడీ ఏడీ భవనం ముందు మీడియాతో మాట్లాడారు. స్థానికులకు తిరుమలలో ప్రతి మంగళవారం ఉచిత ప్రవేశ దర్శనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో అక్రమ రవాణాను అరికడతాం



మీడియాతో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాకూర్

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 9: రైళ్లలో మహిళలు, పిల్లల అక్రమ రవాణాను అరికడతామని దక్షిణ మధ్యరైల్వే భద్రతా దళాల ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ అన్నారు.శుక్రవారం ఎస్వీయూ సమీపంలో రూ.కోటితో నూతనంగా నిర్మించిన ఆర్పీఎఫ్ అధికారుల విశ్రాంతి భవనం, నూతన వాహనాన్ని దక్షిణ రైల్వే ఐజీ ఈశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. యూనిఫాం లేకుండా ఆర్పీఎఫ్ సిబ్బంది ద్వారా నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైల్వేస్టేషన్లలోనూ ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతకుముందు పాత బ్యారక్స్‌లో సిబ్బందికి కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. నూతన భవనంలో ప్రగతి, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సేవలను, రైల్వేస్టేషన్లలో బాలకార్మిక నిర్మూలన, చైల్డ్ హెల్ప్ లైన్ డెస్కుల పనితీరును ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రైల్వే భద్రతా దళాల విభాగం అధికారులు రాజగోపాల్‌రెడ్డి, మురళీకృష్ణ, సంతోష్‌కుమార్ రాయ్, ఐపీఎఫ్‌లు మధుసూదన్, ఎం.సందీప్‌కుమార్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మహిళలు సామూహిక వ్రతాలు నిర్వహించాలి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 9: సమాజంలో మహిళలు సామూహిక వ్రతాలు నిర్వహించడం అలవర్చుకోవడం వల్ల భక్తిభావం పెరుగుతుందని ఏఎస్ఐ గిరిజ, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు అన్నారు. బైరాగిపట్టెడలోని రాస్ మహిళా పొదుపు సంఘాల క్లస్టర్‌లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పూజలు చేశారు. అనంతరం వృద్ధులకు చేతి కర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. రాస్ సిబ్బంది మునిరాజ, చంద్రకళ, నాగేశ్వర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో కుంభాభిషేకం



మూలస్థాన ఎల్లమ్మ ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని దంపతులు

చంద్రగిరి, ఆగస్టు 9: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ, శతం చండీ సహిత,సహస్ర కలశ కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం 5.50 గంటలకు గణపతి పూజ, పంచగవ్య, మార్జనలు, యంత్ర ప్రతిష్ఠ సహిత సహకుంభాభిషేకం, మూలమంత్ర హోమాలు, మహాపూర్ణాహుతి, ఆచార్యపూజ, అగ్నిప్రదక్షణ, ఆశీర్వచనం, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ జిల్లా అధికారి పుట్టా రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఉత్సవాల కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి హేయం

తిరుపతి రూరల్, ఆగస్టు 9: విజయవాడలో మాజీ సీఎం జగన్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సామాజిక న్యాయ మహాశిల్పంపై కొందరు దాడి చేయడం హేయమని తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఖండించారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీనేతలతో కలసి శాంతియుతంగా నిరసన తెలిపారు. మహాశిల్పం దాడి విషయమై పోలీసులకు సమాచారం అందినా సకాలంలో స్పందించపోవడం దారుణమన్నారు. సమగ్ర విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామసర్పంచ్ దామినేటి కేశవులు, ఉపసర్పంచ్ పరందామరెడ్డి, నాయకులు చెంచు మోహన్‌యాదవ్, ప్రసాద్, చంద్రశేఖర్, గంగిరెడ్డి, రవి, రాజారెడ్డి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

18న వెరికోస్ వెయిన్స్‌పై ఉచిత వైద్య శిబిరం

తిరుపతి(విద్య), ఆగస్టు 9: వెరికోస్ వెయిన్స్‌కు సంబంధించి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని తిరుచానూరులో ఈనెల 18వ తేదీన భువనేష్ కనస్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు ఎండీ వి.మల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం మెగావిన్ వాస్క్యులర్ కేర్ ఆసుపత్రి వైద్యులు పి.విజయ్‌కుమార్, హరీష్ రాజకుమార్, ఈఎస్ఐ ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ కె.బాలశంకర్‌రెడ్డి తదితరులతో కలిసి శిబిరానికి చెందిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుచానూరులోని కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మెగావిన్ ఎండీ డాక్టర్ వినయ్ స్వాపతి ఇతర సిబ్బందితో పాల్గొని వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. మందులుకూడా ఉచితంగానే అందజేస్తామన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గిరిధర్, సురేష్‌వర్మ, పళని తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు సీఐగా సునీల్‌కుమార్



తిరుచానూరు, ఆగస్టు 9: తిరుచానూరు సీఐగా బి.సునీల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో ఏసీబీలో పనిచేస్తున్న సునీల్‌కుమార్‌ని నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. పద్మావతి అమ్మవారు కొలువైన తిరుచానూరులో సీఐగా బాధ్యతలు స్వీకరించడం పూర్వజన్మ సుకృతమన్నారు. ప్రజా ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని, అమ్మవారి భక్తులు ఎక్కడా ఇబ్బంది పడకుండా తనవంతు సహకారం టీటీడీకి అందజేస్తామన్నారు.

భాకరాపేట ఇన్‌చార్జి సీఐగా శ్రీనివాసులు



ఎర్రావారిపాలెం, ఆగస్టు 9: భాకరాపేట ఇన్‌చార్జి సీఐగా బీవీ శ్రీనివాసులు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి పోలీస్ కమాండ్ సెంటర్లో పనిచేస్తున్న ఈయన్ను ఇక్కడికి నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చిన్నగొట్టిగల్లులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

భాకరాపేట, ఆగస్టు 9: ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే ఎండీయూ వ్యవస్థను, రేషన్ డీలర్లను కొనసాగిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంపై రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సహదేవ నాయక్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో ఎండీయూ వ్యవస్థ ప్రవేశ పెట్టారని, అయినా నిత్యావసర సరుకులు పంపిణీ సరిగ్గా జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రేషన్ డీలర్లకు పూర్వ వైభవం తీసుకురావడం సంతోషకరమన్నారు. డీలర్లు నారాయణ, రవీంద్రనాథరెడ్డి, సునీల్, మురళి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

భాకరాపేట, ఆగస్టు 9: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రిసోర్స్ పర్సన్లు శశిరేఖ, మాలతి అన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కోటబైలు గ్రామంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటింటా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి చెత్త సేకరణ కేంద్రాలకు తరలించాలన్నారు. వర్మి కంపోస్టు తయారీ, మార్కెటింగ్ చేసే పద్ధతులను వివరించారు. ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.



కోటబైలులో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నగరంలో గంజాయికి తావులేదు
డీఎస్పీ వెంకటనారాయణ



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 9: నగరంలో గంజాయి కనిపించకూడదు.. ఎవరైనా సరఫరా చేసినా, విక్రయిస్తున్నా కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ హెచ్చరించారు. నూతన డీఎస్పీగా శుక్రవారం తన చాంబరులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాపై తనకు అవగాహన ఉందన్నారు. గతంలో ట్రాఫిక్ డీఎస్పీగా, వివిధ క్యాడర్లలో పనిచేశానని చెప్పారు. ప్రభుత్వ ఆశయాలు, ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. త్వరలోనే అన్ని పోలీసుస్టేషన్లు తనిఖీ చేసి.. రిసెప్షన్ కేంద్రాల బలోపేతంపై చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు.

వీర సైనికుల సేవలు విలువకట్టలేనిది



వీరసైనికులకు సన్మానం

తిరుపతి అర్బన్, ఆగస్టు 9: హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం యూత్‌హాస్టల్లో కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన వీర సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు, యుద్ధంలో మరణించిన వారి భార్యలకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి.. నిద్రాహారాలు లేకుండా అత్యంత క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటూ దేశరక్షణకు పాటుపడిన వీరసైనికుల సేవలు విలువకట్టలేనివని కొనియాడారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ మాట్లాడుతూ.. సైనికుల క్రమశిక్షణ, ధైర్య సాహసాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 12మంది వీరసైనికులను సత్కరించారు. విశ్రాంత ఉద్యోగులు ఆనందరెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వేకువజాము జరిగిన అభిషేక సేవలో తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి, గోవా మంత్రి విశ్వజిత్ రాణే దర్శించుకోగా, వీఐపీ బ్రేక్ సమయంలో ఏపీ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జయలక్ష్మి, ఎమ్మెల్యేలు చదలవాడ అరవింద్‌బాబు, కృష్ణచైతన్య రెడ్డి స్వామి సేవలో పాల్గొన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు

తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 63,535 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,685 మంది తలనీలాలు సమర్పించారు.

డ్రగ్ మాఫియాను అరికట్టండి



భవానీనగర్ కూడలిలో నిరసన తెలుపుతున్న మహిళలు, విద్యార్థులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 9: నగర పరిధిలో డ్రగ్స్ మాఫియాను ప్రభుత్వం అరికట్టాలని డీవైఎఫ్ఐ, ఐద్వా సంఘాల నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం భవానీనగర్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో డ్రగ్స్ విచ్చలవిడిగా లభిస్తున్న కారణంగా యువత తమ జీవితాలు నాశనం చేసుకుంటోందని వాపోయారు. చంద్రగిరి హైస్కూలు సమీపంలో డ్రగ్స్ లభించడం ఆందోళన కలుగుతోందన్నారు. ప్రభుత్వం ఇకనైనా కఠిన చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, ఎం.జయంతి, అక్బర్, సురేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలు సరికొత్తగా ఉండాలి



జ్యోతిని వెలిగిస్తున్న మన్నెం రామిరెడ్డి

తిరుపతి రూరల్, ఆగస్టు 9: విద్యార్థులకు ఆలోచనలు సరికొత్తగా ఉంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి అన్నారు. కరకంబాడిరోడ్డులోని కళాశాలలో ఈవిద్యాసంవత్సరంలో కొత్తగా ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు శుక్రవారం ఓరియెంటేషన్ డే నిర్వహించారు. డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్ రెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి: ఆరణి

తిరుపతి (జీవకోన), ఆగస్టు 9: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఒకటో డివిజన్ పీహెచ్‌సీ సిబ్బందికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీని ఆయన పరిశీలించగా, మెడికల్ ఆఫీసర్ మౌనికారెడ్డి స్వాగతం పలికారు. నగరంలోని 13 పీహెచ్‌సీలన్నీ సక్రమంగా పనిచేస్తున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి తెలిపారు.

ఎస్వీసీఈలో ఓరియెంటేషన్ డే



థామస్‌ని అభినందిస్తున్న సుధాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఆగస్టు 9: కరకంబాడిరోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల (ఎస్వీసీఈ)లో ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు శుక్రవారం ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన ఏటీఎస్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ అన్బు హాజరవగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి, ఛైర్మన్ గంగిరెడ్డి, వైస్‌ఛైర్మన్ ప్రకాశ్, సెక్రటరీ ప్రదీప్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ తారకేశ్వర్, డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్థానికులకు 750 అంగప్రదక్షిణ టికెట్లు కేటాయించాలి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 9: ప్రతి శనివారం స్థానికులకు 750 శ్రీవారి అంగప్రదక్షిణ టికెట్లను కేటాయించాలని తిరుపతి స్థానిక హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డీఎంసీ భాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలోవలె స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఘాట్ ప్రమాదంలో బస్సు డ్రైవర్ అరెస్ట్

తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌లోని చివరి మలుపు(తిరుమలకు జీఎన్సీ టోల్‌గేట్‌కు సమీపం ప్రాంతం)లో ఓ యువకుడు, యువతి బైక్‌పై ప్రయాణిస్తూ ముందు వెళుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వీరిద్దరూ తమిళనాడులోని పల్లిపట్టు తాలూక వెలియాగరం గ్రామానికి చెందిన ఏఎస్ కార్తీక్(28), తిరువణ్ణామలై జిల్లాలోని చెంజాం తాలూక మషర్ గ్రామానికి చెందిన సౌమ్య(21)గా గుర్తించి మృతదేహాలను కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు. చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న వీరు ఒకరిని ఇష్టపడుతున్నట్టు తెలిసింది. వీరి ప్రేమ వ్యవహారం కుటుంబీకులకు కూడా తెలియదు. స్వామి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశంతో వచ్చి దుర్మరణం చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కాంతారావును అదుపులోకి తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. బస్సు డ్రైవర్‌దే తప్పని తేలడంతో అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇక ఏసీ బస్సు ముందు, వెనుకభాగంలో కెమెరాలున్నా స్విచ్ వేయలేదని అధికారులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ ఫుటేజ్ ఉంటే ప్రమాదం ఎలా జరిగింది, తప్పు ఎవరిదనే విషయాలు స్పష్టంగా అందరికీ తెలిసేవి.

14నుంచి యోగా శిక్షణ

తిరుపతి(క్రీడలు),ఆగస్టు9:ఈశాఫౌండేషన్ ఆధ్వర్యంలో సప్తగిరినగర్‌లోని కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం భవనంలో ఈనెల14నుంచి20వ తేదీవరకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.రోజూ ఉదయం, సాయంత్రం మూడు గంటలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారు. వివరాలకు 6305552431, 8328426350నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

వైఖానస ఆగమ శాస్త్రమే ప్రమాణం
కశ్యప మహర్షి జయంతిలో పండితుల ఉద్ఘాటన

తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆరాధన విధానానికి వైఖానస మహర్షి రచించిన వైఖానస భగవత్ శాస్త్రం మూలమని పండితులు తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో వైఖానస దివ్యసిద్ధాంత వివర్ధిని సభ, టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వైఖానస మహర్షి శిష్యుల్లో ఒకరైన కశ్యప మహర్షి తిరునక్షత్రోత్సవాన్ని నిర్వహించారు. వైఖానస సభ కార్యదర్శి శ్రీనివాస దీక్షితులు మాట్లాడుతూ..విద్యార్థులు వైజ్ఞానికదృక్పథంతో శాస్త్రాధ్యయనం చేసి సమాజానికి సేవచేయాలన్నారు. విఖనస ట్రస్టు కార్యదర్శి ప్రభాకరాచార్యులు మాట్లాడుతూ ఆలయ సంస్కృతికి ఆధారమైన ఆగమశాస్త్రాల పరిరక్షణ సమాజం బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. తర్వాత వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధినీ సభ అధ్యక్షుడు రాఘవ దీక్షితులు ప్రసంగిస్తూ మానవాళి మహోన్నత స్థితికి చేర్చే ఆరాధనా విధానం కశ్యప మహర్షి జ్ఞానకాండ గ్రంథంలో వివరించారన్నారు. ఎస్వీ వేదవిశ్వ విద్యాలయం ఆచార్యులు, ధర్మగిరి వేదజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర పండితులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి
ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ఆదివాసీలతో ఎమ్మెల్యే, కమిషనర్ తదితరులు

తిరుపతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అభ్యున్నతికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. విద్య, ఉపాధి అవకాశాలను ఆదివాసులు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని శుక్రవారం గిరిజన భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదివాసీలను అన్నిరంగాల్లో అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. గిరిజన భవన్ నిర్వహణను ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నుంచి గిరిజన భవన్ ట్రస్ట్‌కు అప్పగించాలని గిరిజన నాయకులు ఈసందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. అలాగే గిరిజన్ కల్యాణ మండపాల్లో కిచెన్, డైనింగ్ హాల్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. గిరిజన భవన్ నిర్వహణపై అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్, డీటీడబ్ల్యూవో సూర్యనారాయణ, బీజేపీ నేత భాను ప్రకాష్ రెడ్డి, జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు శివానాయక్, రిటైర్డ్ ఆర్డీవో సరస్వతమ్మ, వెంకటరమణ నాయక్, గుండాల నాయక్, కళావతి, శ్రీనివాసులు, వసంతమ్మ, సురేంద్ర బాబు, బాలాజి, చలపతి నాయక్, హరిబాబు నాయక్, స్వామ్రాజ్, ప్రసాద్, కిషోర్, శ్రీనివాస్, శివ, ప్రభాకర్, సునీల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో..



సంబరాల్లో కిరణ్‌రాయల్ తదితరులు

తిరుపతి అర్బన్: ఎస్వీయూలో శుక్రవారం విద్యార్థులు నిర్వహించిన ఆదివాసి దినోత్సవంలో తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ పద్మనాభం, వైస్‌ప్రిన్సిపాల్ శ్యామ్‌మోహన్, డేవిడ్, శివశంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి కార్పొరేట్లను దూరంపెట్టండి



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేసున్న రైతులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 9: వ్యవసాయ రంగానికి కార్పొరేట్లను దూరం పెట్టాలని, లేకుంటే సామాన్య రైతులకు మనుగడ కష్టమని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఈ మేరకు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని నాశనం చేయడానికి మోదీ ప్రభుత్వం మూడు నల్లచట్టాలను అమలు చేసిందన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని దేశంలో 500 రైతు సంఘాలు ఆందోళనలు చేస్తున్నా ప్రధాని పెడచెవిన పెట్టడం అన్యాయమన్నారు. సామాన్య రైతులు తమ పొలాలను కార్పొరేట్లకు అప్పగించేలా చట్టాలు చేయడం సమంజసమేనా అని ప్రశ్నించారు. మాంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నూతన చట్టాలతో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే రైతు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు పి.హేమలత, బాలసుబ్రహ్మణ్యం, ఎస్.జయచంద్ర, టి.సుబ్రహ్మణ్యం, పి.సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, మునిరాజ, సి.భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ భూ బాధితులతో కలసి ధర్నాలు
సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని జెండా వూపి పంపుతున్న నారాయణ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు9: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణల బాధితులను ఏకం చేసి వారికి న్యాయం చేయడానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు.తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విధానం భూబకాసురులకు వరంగా మారిందన్నారు.మదనపల్లెలో వున్న భూములకు పులివెందులలో రికార్డులు తారుమారుచేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయాన్ని ప్రశ్నించిన వేంకటేశ్వరరావుపై గత ప్రభుత్వం కేసులు బనాయించిన విషయాన్ని గుర్తుచేశారు.తప్పుడు రికార్డులతో రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారి భరతం పట్టడానికి భూబాధితులను ఏకంచేసి విశాఖపట్టణం నుంచి ఆందోళనలు ప్రారంభిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులను గ్రాంట్ రూపంలో కేటాయించాలన్నారు. కేంద్రప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించకుండా ఢిల్లీలో ఆందోళనలు చేయడం అర్థరహితమని మండిపడ్డారు. ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని గెలిపిస్తే, ఆయన ఆ ప్రజలకు దూరంగా ఢిల్లీ వెళ్ళి ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనని విమర్శించారు.బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఉద్యమాన్ని సీపీఐ సమర్థిస్తోందన్నారు.అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అందరూ సహకరించాలన్నారు.ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు విధానమే మంచిదన్నారు.వయనాడ్‌లో జరిగిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయవిపత్తుగా గుర్తించి జాతీయవిపత్తు నిధినుంచి నిధులు కేటాయించాలని కోరారు.అంతకుముందు వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని ఆయన జెండా వూపి ప్రారంభించారు.సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు,పి.హరినాథరెడ్డి,మురళి, పెంచలయ్య,రాధాకృష్ణ,విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో రెండో పెళ్లికి వరంగల్‌వాసి రెడీ
మొదటి భార్య ఎంట్రీతో పరార్



పోలీస్‌స్టేషన్‌లో కుమార్తెతో సంధ్య - సంధ్య, రాకేష్ పెళ్లి ఫొటో

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి):తెలంగాణకు చెందిన ఒక వ్యక్తి తిరుమలలో శుక్రవారం రెండో పెళ్లికి రెడీ అయ్యాడు. పోలీసులతో మొదటి భార్య ఎంట్రీ ఇవ్వడంతో మండపం నుంచి పరారయ్యాడు.తిరుమల సీఐ సత్యనారాయణ, బాధితురాలి వివరాల మేరకు.. తెలంగాణాలోని వరంగల్ జిల్లా పెద్దపాండ్యానికి చెందిన సంధ్య, రాకేష్‌కు 2016లో పెళ్లి జరిగింది. అయితే 2017 నుంచే మనస్పర్థలు మొదలయ్యాయి.విషయం కోర్టు వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో రాకేష్ మరో అమ్మాయిని తిరుమలలోని మౌనస్వామి మఠంలో పెళ్లిచేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సంధ్య తన కుమార్తె, కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. తమ పెళ్లి ఫొటోలు, కోర్టులో ఉన్న కేసు వివరాలను చూపింది. తన భర్త విడాకులు ఇవ్వకుండానే మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరింది. దీంతో పోలీసులు మఠానికి చేరుకున్నారు. ఈలోపే పెళ్లికూతురుతో రాకేష్ పరారయ్యాడు.రాకేష్ కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.సంధ్య మీడియాతో మాట్లాడుతూ.. 'నాకు నా భర్త కావాలి. నాకు, నా బిడ్డకు న్యాయం జరగాలి' అని కోరింది. ఇంట్లో ఉండటానికి కోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ తన భర్త ఇంట్లో ఉండనియ్యకుండా వెళ్లగొట్టాడని ఆరోపించింది. తిరిగి వస్తే చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని, రాజకీయ అండదండలతో పాటు ఆర్థికంగా బలంగా ఉన్న వాళ్లు ఏం చేసుకుంటావో చేసుకో పో అని బెదిరిస్తున్నారని వివరించింది.సీఐ సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ..సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.పెళ్లిళ్లు చేసే మఠం నిర్వాహకులు వారికి ఇది మొదటిపెళ్లేనా, వారి కులం ఏంటి, ఎక్కడి నుంచి వచ్చారు వంటి వివరాలను తెలుసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయం



తిరుపతి (కల్చరల్) ఆగస్టు 9: ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయమని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. తిరుపతి రామకృష్ణ ఆశ్రమ 9వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం జరిగిన యువజన సదస్సులో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తాను పదివేల గుండె ఆపరేషన్లు చేసినప్పటికీ.. ఆధ్యాత్మిక సాధనకు రోజూ కొంత సమయం కేటాయించగలుగుతున్నానని చెప్పారు. విద్యార్థులు కూడా యోగా, ధ్యానం వంటి వాటికి సమయం కేటాయించాలన్నారు. ఆశ్రమ కార్యదర్శి సుకృతానంద స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన సదస్సులో శశికాంతానంద (రాజమహేంద్రవరం), అనుపమానంద (కడప), మంగళనాథానంద (కర్నాటక) భువనేశ్వరి దేవి (ప్రిన్సిపాల్, టీటీడీ మహిళా జూనియన్ కళాశాల, తిరుపతి) పలు అంశాలను తెలియజేశారు. అనంతరం డాక్టర్ గాయత్రి మనోహర్ బృందం ప్రదర్శించిన కుచేలోపాఖ్యానం నృత్యరూపకం ఆకట్టుకుంది. సత్వస్థానంద, ఆచార్య పీవీ రెడ్డి, శతావధాని ఆముదాల మురళి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

శాకాంబరిగా కరుమారియమ్మ



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 9: యాదవ వీధిలోని కరుమారియమ్మ ఆలయంలో శుక్రవారం ఆడినెల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకాంబరి రూపంలో పలు కూరగాయలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మధుసూదన్‌కి అవార్డు



తిరుపతి(కల్చరల్) ఆగస్టు 9: తిరుపతికి చెందిన ప్రముఖ వాస్తు విజ్ఞాన, జ్యోతిష్య పండితుడు మధుసూదన్‌కి వాస్తు విజ్ఞాన జ్యోతిష్య బ్రహ్మ అవార్డు లభించింది. హైదరాబాదుకు చెందిన లలిత కళా సమాఖ్య, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం వారు ఆదివారం హైదరాబాదులోని హరిహర కళాభవన్‌లో జరిగే సభలో సువర్ణ కంకణంతో సత్కరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఆత్మీయులు అభినందించారు.

ఎస్వీయూలో ఇన్‌చార్జి వీసీ తనిఖీలు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 9: ఎస్వీయూ ఎంసీఏ డిపార్టుమెంట్‌ను ఇన్‌చార్జి వీసీ అప్పారావు శుక్రవారం తనిఖీ చేశారు. తరగతి గదులు, కార్యాలయాలను పరిశీలించి ఆచార్యులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల గైర్హాజరు, వారి సమస్యలపై ఆరా తీశారు. తరగతులు, ల్యాబులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

అష్టబాహుకాళిగా అన్నపూర్ణాదేవి



తిరుపతి అర్బన్, ఆగస్టు 9: పవిత్ర శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణాదేవి ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, డ్రైఫ్రూట్స్‌తో అష్టబాహుకాళిగా అలంకరించారు.

36 లక్షల విలువైన మద్యం ధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 9: తిరుపతిలో దాదాపు 36 లక్షలు విలువ చేసే మద్యం బాటిళ్లను శుక్రవారం ధ్వంసం చేశారు. పోలీసు పరేడ్ గ్రౌండులో ఎస్పీ సుబ్బరాయుడు నేతృత్వంలో సెబ్, ఎక్సైజ్ అధికారులు కలసి సార్వత్రిక ఎన్నికల సమయంలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ వివిధ రకాల పరిమాణంలో ఉన్న 27,568 బాటిళ్లను రోడ్డు రోలర్‌తో తొక్కించేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకురావడం, విక్రయించడం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై 300 కేసులు నమోదు చేశామని చెప్పారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరాం, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య పోటీలు ప్రారంభం



కళాకారులతో నిర్వాహకులు, నృత్యప్రదర్శన



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 9: మహతి కళా క్షేత్రంలో శుక్రవారం ఉదయం శ్రీకృష్ణదేవరాయ జాతీయ సంగీత, నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. నగరానికి చెందిన రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల కళాకారులు ఈ పోటీలో పాల్గొంటున్నారు. మూడ్రోజులపాటు జరగనున్న పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేస్తామని, చివరి రోజున పలువురు కళాకారులకు శ్రీకృష్ణదేవరాయ పురస్కారాలను అందించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి తెలిపారు. కాగా, శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జానపద, శాస్త్రీయ నృత్య, సంగీత పోటీలు జరుగుతాయి. సంస్థ కార్యదర్శి కేఎన్ రాజ, శ్రీరాములు యాదవ్, టి.సుబ్రమణ్యం, కొత్తపల్లి మునిరత్నం, చెంగారెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పరిశ్రమల కోసం భూముల గుర్తింపు

● పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్

నాయుడుపేట టౌన్, ఆగస్టు 9 : కొత్త పరిశ్రమల కోసం సెజ్‌లలో మిగిలి ఉన్న భూములను గుర్తిస్తు న్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తెలి పారు. మేనకూరు సెజ్‌లో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి భూములను పరిశీలించారు. మొదటగా ఏపీఐఐసీ కార్యాలయానికి చేరు కుని ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. కొత్తగా పరిశ్రమలు వస్తే కేటాయించడానికి ఎంత భూమి సిద్ధంగా ఉంది.. ఆ భూముల స్థితిగతులపై ఆరా తీశారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న భూములపై అధికారులతో చర్చించారు. గతంలో సెజ్‌లో నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన నిర్మాణ పనులు ఆగిపోవడంతో వాటిపై కూడా సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట తహసీల్దారు గీతావాణి, ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



భూములను పరిశీలిస్తున్న యువరాజ్, కలెక్టర్ వెంకటేశ్వర్

నాయుడుపేట డీఎస్పీగా చెంచుబాబు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 9 : నాయుడుపేట డీఎస్పీగా చెంచుబాబు బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తూ బదిలీపై నాయుడుపేటకు వచ్చారు. ఆమేరకు శుక్రవారం ఉదయం డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నాయుడుపేట డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు పుష్పగుచ్ఛాలు అందజేసి డీఎస్పీకి అభినందనలు తెలియజేశారు.

సీఐగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకారం



సూళ్లూరుపేట, ఆగస్టు 9: సూళ్లూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు టీంలో పనిచేస్తూ సూళ్లూరుపేట సీఐగా మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఆమేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించగా తడ, సూళ్లూరుపేట ఎస్‌ఐలు నరసింహారావు, రహీంరెడ్డి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అలాగే ఇక్కడ సీఐగా పనిచేస్తున్న మధుబాబును ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. ఆయన శుక్రవారం రిలీవ్ అయ్యారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

తడ/సూళ్లూరుపేట, ఆగస్టు 9: నేడు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ ఖాదర్‌బాషా, ఏఈ మురళి పేర్కొన్నారు. ఆయా సబ్ స్టేషన్లలో సాధారణ మరమ్మతులు చేపడతున్న కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నైపుణ్యాలను పెంపొందించుకోండి



ఓరియంటేషన్ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు

గూడూరు, ఆగస్టు 9: ఉన్నతస్థాయికి ఎదగడానికి విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా బీటెక్‌లో చేరిన విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవరుచుకోవాలన్నారు. లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి వాటిని సాధించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో దశరథరామయ్య, డాక్టర్ రవిప్రసాద్, విష్వక్సేనారెడ్డి, నీరజ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ సేవలు అభినందనీయం



గర్భిణులకు ఆహారం అందిస్తున్న వెంకటేశ్వర్లు

గూడూరు అర్బన్, ఆగస్టు 9: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయడమే కాకుండా, సైన్స్‌పట్ల అవగాహన కల్పిస్తూ, చేడు అలవాట్లకు బానిసలు కాకుండా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం స్ఫూర్తిదాయక మన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, డాక్టర్ షరీనా, వి.రాజేంద్ర ప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, రామ్మోహన్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను వినియోగించుకోండి

● బకాయిదారులకు యూనియన్ బ్యాంకు సూచన

పెళ్లకూరు ఆగస్టు 9: రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న వారికి యూనియన్ బ్యాంకు అమలు చేస్తున్న వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ వి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెంబేడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రుణాలు తీసుకుని రెండు, మూడేళ్లగా రుణాలు తిరిగి చెల్లించలేని బకాయిదారులు రుణ విముక్తి నుంచి ఉపశమనం పొందేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు, నాయుడుపేట యూనియన్ బ్యాంకు మేనేజర్లు రాజశేఖర్, జీవీ మహిధర్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి



కేక్‌కట్ చేస్తున్న పీఆర్ క్లబ్ సభ్యుడు గోపాల్‌రెడ్డి

గూడూరు, ఆగస్టు 9: తమకున్నంతలో పేదలకు సేవ చేయడం ద్వారానే సంతృప్తిని పొందుతామని పీఆర్ క్లబ్, రోటరీ క్లబ్ సీనియర్ సభ్యుడు ఎ.గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పీఆర్ క్లబ్‌లో క్లబ్ సీనియర్ సభ్యుడు గోపాల్‌రెడ్డి 75వ పుట్టినరోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా పార్టీలకతీతంగా అందరికీ సాయం చేశానన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సిద్దారెడ్డి, కె.మీరారెడ్డి, మధురెడ్డి, మస్తాన్‌నాయుడు, ఉమాశంకర్, చెంచురామయ్య, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్‌డీగా పదోన్నతి

వాకాడు, ఆగస్టు 9 : మండలంలోని వాకాడు పంచాయతీ ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర రావుకు వెంకటగిరి నియోజక వర్గంలోని కమ్మవారిపేట ఈవోపీఆర్‌డీగా పదోన్నతి వచ్చింది. ఈ సందర్భంగా సహచర సిబ్బంది ఉమామహేశ్వర రావుకు అభినందించారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు



వాకాడు, ఆగస్టు 9: మండలంలోని అశోక్ పిల్లర్ ప్రాంగణంలో సూపర్‌స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, బాణసంచా కాల్చి కేక్‌ను కట్‌చేసి పంచి పెట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకున్న శ్రీమంతుడని మహేష్‌బాబును కొనియాడారు.

16న అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

తిరుచానూరు, ఆగస్టు 9: తిరుచానూరు పద్మావతీ దేవి ఆలయంలో 16వ తేదీ వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలోని ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నారు.వ్రతంలో పాల్గొనే గృహస్థులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, లడ్డూ, వడ ఇవ్వనున్నారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. వ్రతం కారణంగా శుక్రవారం ఆలయంలో ఆర్జితసేవలైన అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, వేదాశీర్వాదం, బ్రేక్ దర్శనం, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది.

రేపు కంటి వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని అన్న క్యాంటీన్ ఎదురుగా ఉన్న డాక్టర్ శశీన్ దంత వైద్య ఆసుపత్రిలో ఆదివారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. నెల్లూరు సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పెన్షనర్స్, ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డు ద్వారా కంట్లో శుక్లం ఆపరేషన్ ఉచితంగా చేస్తారన్నారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ కార్డుదారులకు పరీక్షలు నిర్వహించడమే కాకుండా శస్త్రచికిత్సలు చేపడుతామని చెప్పారు

వైసీపీ భూ బాధితులతో కలసి ధర్నాలు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని జెండా వూపి పంపుతున్న నారాయణ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు9: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణల బాధితులను ఏకం చేసి వారికి న్యాయం చేయడానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు.తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విధానం భూబకాసురులకు వరంగా మారిందన్నారు. మదనపల్లెలో వున్న భూములకు పులివెందులలో రికార్డులు తారుమారుచేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయాన్ని ప్రశ్నించిన వేంకటేశ్వరరావుపై గత ప్రభుత్వం కేసులు బనాయించిన విషయాన్ని గుర్తుచేశారు.తప్పుడు రికార్డులతో రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారి భరతం పట్టడానికి భూబాధితులను ఏకంచేసి విశాఖపట్టణం నుంచి ఆందోళనలు ప్రారంభిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులను గ్రాంట్ రూపంలో కేటాయించాలన్నారు. కేంద్రప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించడాన్ని సీఎం చంద్రబాబు ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించకుండా ఢిల్లీలో ఆందోళనలు చేయడం అర్థరహితమని మండిపడ్డారు. ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని గెలిపిస్తే, ఆయన ఆ ప్రజలకు దూరంగా ఢిల్లీ వెళ్ళి ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనని విమర్శించారు.బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఉద్యమాన్ని సీపీఐ సమర్థిస్తోందన్నారు. అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అందరూ సహకరించాలన్నారు.ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు విధానమే మంచిదన్నారు.వయనాడ్‌లో జరిగిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయవిపత్తుగా గుర్తించి జాతీయవిపత్తు నిధినుంచి నిధులు కేటాయించాలని కోరారు.అంతకుముందు వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని ఆయన జెండా వూపి ప్రారంభించారు.సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.హరినాథరెడ్డి, మురళి, పెంచలయ్య,రాధాకృష్ణ,విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో రెండో పెళ్లికి వరంగల్‌వాసి రెడీ

మొదటి భార్య ఎంట్రీతో పరార్



పోలీస్‌స్టేషన్‌లో కుమార్తెతో సంధ్య - సంధ్య, రాకేష్ పెళ్లి ఫొటో

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి):తెలంగాణకు చెందిన ఒక వ్యక్తి తిరుమలలో శుక్రవారం రెండవపెళ్లికి రెడీ అయ్యాడు. పోలీసులతో మొదటి భార్య ఎంట్రీ ఇవ్వడంతో మండపం నుంచి పరారయ్యాడు.తిరుమల సీఐ సత్యనారాయణ, బాధితురాలి వివరాల మేరకు.. తెలంగాణాలోని వరంగల్ జిల్లా పెద్దపాండ్యానికి చెందిన సంధ్య, రాకేష్‌కు 2016లో పెళ్లి జరిగింది. అయితే 2017 నుంచే మనస్పర్థలు మొదలయ్యాయి. విషయం కోర్టు వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో రాకేష్ మరో అమ్మాయిని తిరుమలలోని మౌనస్వామి మఠంలో పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సంధ్య తన కుమార్తె, కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. తమ పెళ్లి ఫొటోలు, కోర్టులో ఉన్న కేసు వివరాలను చూపింది. తన భర్త విడాకులు ఇవ్వకుండానే మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరింది. దీంతో పోలీసులు మఠానికి చేరుకున్నారు. ఈలోపే పెళ్లికూతురుతో రాకేష్ పరారయ్యాడు.రాకేష్ కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.సంధ్య మీడియాతో మాట్లాడుతూ.. 'నాకు నా భర్త కావాలి. నాకు, నా బిడ్డకు న్యాయం జరగాలి' అని కోరింది. ఇంట్లో ఉండటానికి కోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ తన భర్త ఇంట్లో ఉండనియ్యకుండా వెళ్లగొట్టాడని ఆరోపించింది. తిరిగి వస్తే చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని, రాజకీయ అండదండలతో పాటు ఆర్థికంగా బలంగా ఉన్న వాళ్లు ఏం చేసుకుంటావో చేసుకో పో అని బెదిరిస్తున్నారని వివరించింది.సీఐ సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.పెళ్లిళ్లు చేసే మఠం నిర్వాహకులు వారికి ఇది మొదటిపెళ్లేనా, వారి కులం ఏంటి, ఎక్కడి నుంచి వచ్చారు వంటి వివరాలను తెలుసుకోవాలని సూచించారు.

మా కుటుంబాలను రోడ్డున వేయొద్దు

● మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోండి

● కలెక్టరేట్ ఎదుట ఎస్పీవోల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 9: 'మా కుటుంబాలను రోడ్డున వేయొద్దు.. మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకుని ఆదుకోండి' అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీవోలు) వేడుకున్నారు. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన స్పెషల్ పోలీసులు శుక్రవారం తిరుపతిలోని యూత్ హాస్టల్లో సమావేశమయ్యారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వర్షం కురుస్తున్నా కూడా ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ధర్మచందు మాట్లాడుతూ.. జీవో నెంబరు 111 ప్రకారం మాజీ ఆర్మీ జవానులు, సివిల్ వ్యక్తులతో కలిపి ఏపీ స్పెషల్ ఆఫీసర్స్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా 2,156 మందిని పోలీసు శాఖకు అనుసంధానంగా గత ప్రభుత్వం నియమించిందని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో రాత్రీపగలు విధులు నిర్వహించి.. ఎర్రచందనం, మద్యం, గంజాయి తదితరాల అక్రమ రవాణాను నిరోధించామన్నారు. అయినా గత ప్రభుత్వం 18 నెలలుగా జీతాలు చెల్లించలేదని వాపోయారు. జీతాల కోసం ఆందోళన చేయాలనుకుంటే అప్పటి ప్రభుత్వ పెద్దలు మాయ మాటలుచెప్పి విరమింపజేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు.. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తమ సమస్యలను అనేక వేదికలపై ప్రస్తావించారని, అధికారంలోకి వస్తే ఆదుకుంటామన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్నట్టుండి తమను విధులనుంచి తొలగించారన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నారా లోకేష్ తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ధర్నా సందర్భంగా తిరుచానూరు పోలీసులు కలెక్టరేట్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. కలెక్టరేట్‌లోకి కేవలం ముఖ్య నాయకులను మాత్రమే అనుమతించారు. ఈ నిరసన కార్యక్రమంలో సుమారు 150 మంది ఎస్పీవోలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి శ్రీకారం: ఆదిమూలం



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు, ఆగస్టు 9: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠ శాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యనం దించేందుకు ప్రభుత్వం విద్యాభివృద్ధికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. సత్యవేడు ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు ఆధ్వ ర్యంలో శుక్రవారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా రాత, పాఠ్య పుస్తకాలు అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇంటర్ విద్య నిచ్చెన లాంటిదన్నారు. ఇక్కడ ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని ఆదిశగా పయనిస్తే ప్రతి ఒక విద్యార్థి విజయశిఖరాలకు చేరుకోవచ్చన్నారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి తల్లితండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ రవిచంద్ర బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు రోశయ్య, సుబ్రహ్మణ్యం రాజు, చిన్న, బాలమురళి, అమాసరెడ్డి, సంతోష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్స్‌కు నగదు ప్రోత్సాహకం

సత్యవేడు, ఆగస్టు 9: సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గత ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో పాఠశాల టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో. శుక్రవారం ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా నగదు బహుమతులను అందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు గణేష్‌కు రూ.10 వేలు, శిరీషకు రూ. 6వేలు, దీపికకు రూ.నాలుగు వేలును దాతలు చొక్కలింగం, రమేష్‌రాజు, ప్రవీణ్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీసిటీ పీఆర్వో రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అధ్యాపకుల వినతి

సత్యవేడు, ఆగస్టు 9: సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఆదిమూలానికి వినతిపత్రం అందించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు తమ సమస్యలను విన్నవించారు. గత వైసీపీ ప్రభుత్వం తమను రెగ్యులర్ చేస్తామని చెప్పి, జీవో తీసుకొచ్చి అమలు చేయకుండా నిలువునా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో తమతో పాటు నియమించిన ఒప్పంద అధ్యాపకులను అక్కడి ప్రభుత్వం రెగ్యులర్ చేసిందని, తమను మాత్రం ఇంకా రెగ్యులర్ చేయలేదన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధీర్, శివరామ్, సలీం, దస్తగిరి, కృష్ణవేణి, గీత తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కార్పొరేట్లను తరిమికొడదాం: సీపీఎం

సత్యవేడు, ఆగస్టు 9: క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశంలో వ్యవసాయ, కార్మిక రంగాలపై ఆధిపత్యం చెలాయిస్తున్న కార్పొరేట్ పెత్తందారులను తరిమికొడదామని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను నిరసిస్తూ భారత్ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ కార్మికసంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కేరళ తరహాలో రాష్ట్రంలో రైతులకు రుణ విమోచన చట్టం తీసుకురావాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం డీటీ రవిచంద్రబాబుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు

తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 63,535 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,685 మంది తలనీలాలు సమర్పించారు.

అంకాళ పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



కోట, ఆగస్టు 9: మండలంలోని అల్లారెడ్డి శ్యామసుందరపురంలో అంకాళ పరమేశ్వరి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతి పూజ, యంత్ర, జప, అనుష్ఠములు, అంకురార్పణ, వాస్తుమండపం, యోగి మండపం, నవగ్రహ మండప ఆరాధనలు, అగ్ని ప్రతిష్ఠ, లక్ష్మీగణపతి హోమం జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద కొలువై ఉన్న గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని 85 చీరలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మొదటి శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని దుర్గాదేవి, అంకమ్మ, మానసాదేవి, కన్యకా పరమేశ్వరి ఆలయాలలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుందరమ్మకు విశేషపూజలు



చిల్లకూరు, ఆగస్టు 9: పట్టణంలోని దళితవాడలో కొలువై ఉన్న సుందరమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం విశేషపూజలు జరిగాయి. శుక్రవారం, శనివారం, ఆదివారం మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్లలో భాగంగా మొదటిరోజు అమ్మవారికి విశేషపూజలు, కలశ స్థాపన, త్రిశూల ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈశ్వర దేవస్థానానికి భూమిపూజ



నాయుడుపేట, ఆగస్టు 9: మండలంలోని పుదూరు సమీపంలో ప్రణవ బ్రహ్మ సూత్ర ఈశ్వర దేవస్థానానికి భూమిపూజ నిర్వహించారు. శుక్రవారం జరిగిన భూమిపూజ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు పాల్గొన్నారు. అలాగే దేవప్రయోగ పీఠాధిపతి చిదానంద మహారాజ్ కూడా పాల్గొన్నారు.

12నుంచి సర్పంచులకు శిక్షణ

బాలాయపల్లి, ఆగస్టు 9: పంచాయతీలకు వచ్చే నిధులపై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో అరుణ అవగాహన కల్పించనున్నారు. ఈనెల 12న సోమవారం నుంచి 14 తేది వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



భూమిపూజలో నెలవల తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 9: రోటరీక్లబ్ సేవలు అభినందనీయమని సూళ్లూరుపేట నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. సీడీసీ మాజీ ఛైర్మన్ కె.సుధాకర్ రెడ్డి తన తండ్రి రామచంద్రా రెడ్డి జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్కు సమీపంలో రూ.15 లక్షలతో బస్‌షెల్టర్‌ను నిర్మిస్తున్నారు. శుక్రవారం ఉదయం జరిగిన భూమిపూజలో నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరికి, మేనకూరులోని పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ప్రయాణికులకు సౌకర్యంగా బస్‌షెల్టర్ నిర్మించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గోపీనాథ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన వేలూరు

పెళ్లకూరు ఆగస్టు 9 : రాష్ట్ర జలవనరుల శా ఖ మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి అమరా వతి లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పేదలకు సంక్షేమ పథకాలు అందేలా, పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని వారు సూచించినట్లు మురళీకృష్ణారెడ్డి తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కల్యాణ్

పెళ్లకూరు ఆగస్టు 9: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌ను మండలంలోని శిరసనంబేడుకు చెందిన టీడీపీ యువనేత, కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వి.కల్యాణ్‌రెడ్డి అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన ట్రస్ట్ ద్వారా సూళ్లూరుపేట, నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు నిధుల పెంపు

వరదయ్యపాళెం, ఆగస్టు 9: పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు పెంచినట్లు ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో రూ.100, రూ.250 ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.10వేలు, రూ.25వేలకు పెంచినట్లు తెలిపారు. 5వేల జనాభా లోపున్న పంచాయతీలకు రూ.10వేలు, అంతకు మించివున్న పంచాయతీలకు రూ.25వేలు అందిస్తారన్నారు. అదే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఏ విధంగా నిర్వహించాలో మార్గదర్శకాలనుకూడా విడుదల చేశారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రాజ్యాంగ విశిష్టత, ఆగస్టు 15 విశిష్టత, స్థానిక సంస్థల పాలన వంటి అంశాలపై వ్యాసరచన, క్విజ్, డిబేట్ వంటి పోటీలతో పాటు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులతో పాటు రక్షణ రంగం నుంచి వచ్చిన వారిని, పారిశుధ్య కార్మికులను సత్కరించాలన్నారు.

రేణిగుంట రైల్వేస్టేషన్‌లో పటిష్ఠ భద్రత: ఐజీ



ఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న ఆరోమ సింగ్ ఠాగూర్

రేణిగుంట, ఆగస్టు 9: రేణిగుంట రైల్వేస్టేషన్‌లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తామని దక్షిణ మధ్య రైల్వే ఐజీ ఆరోమసింగ్ ఠాగూర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట రైల్వేస్టేషన్‌ను ఆమె సందర్శించారు. రైల్వే షెడ్యూల్, ప్లాట్‌ఫాంపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. దొంగతనాలను కట్టడి చేసేకుందకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని, అలాగే రాత్రి సమయాల్లో రైలులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి భద్రత కల్పిస్తున్నారని సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో 12 సీసీ కెమెరాలు ఉన్నాయని, త్వరలో 104 కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైల్వేస్టేషన్ పరిసరాలు, ప్లాట్‌ఫాంలపై సంచరిస్తున్న పాత నేరగాళ్లను గుర్తించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే ద్వారా సీసీ కెమెరాలు అమర్చుతామని చెప్పారు. దీనివల్ల గతంలో నేరాలకు పాల్పడిన దొంగలను గుర్తించి ఫొటోలు తీసి కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ మెసేజ్ పంపడం ద్వారా నేరస్తులను పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా రేణిగుంట ఆర్పీఎఫ్ స్టేషన్‌కు ప్రత్యేకంగా నాలుగు ట్యాబ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. వీటి ద్వారా అనుమానితుల ఫొటోలు, వీడియోలను చిత్రీకరించవచ్చన్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సమన్వయంతో రైళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో ప్రయాణించే ఒంటరి మహిళలు, చిన్నపిల్లలకు రక్షణలో భాగంగా ప్రతి రైల్వే స్టేషన్‌లో మహిళా భోగి వద్ద పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, ఏఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్, ఎస్‌ఐలు రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిచ్చు రేపిన ఇసుక

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ వర్గీయుల దాడి నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి, భార్గవి, భార్గవ్

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: ఇసుక వివాదం చిచ్చురేపడంతో టీడీపీ సానుభూతిపరుల కుటుంబంపై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు వివరాలు... శ్రీకాళహస్తి మండలం ఇనగలూరుకు చెందిన వెంకట్రాయులు టీడీపీ కార్యకర్త. కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన ఈయన మట్టికుండలు, ప్రమిదలు చేసి జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం గ్రామంలో మట్టిపాత్రలు చేసేందుకు కొందరు ఇసుకను ట్రాక్టరు ద్వారా తోలుకున్నారు. అదే సమయంలో వెంకట్రాయులు కుటుంబ సభ్యులు కూడా వారి వద్ద నుంచి ఒక ట్రాక్టర్ ఇసుకను తోలు కున్నాడు. వైసీపీ వర్గీయులు తాము ఏర్పాటు చేసుకున్న ట్రాక్టరుతో మీరు ఎలా ఇసుక తోలుకుంటారు అంటూ వెంకట్రాయులుతో వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో వైసీపీ వర్గీయులు వెంకట్రాయులు కుటుం బంపై దాడి చేశారు. ఈ ఘటనలో వెంకట్రాయులు భార్య విజయలక్ష్మి, కూతుర్లు వరలక్ష్మి, భార్గవి, కుమారుడు గాయపడ్డారు. వారు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ముత్యాలమ్మకు పూజలు



కూరగాయాల అలంకారంలో ముత్యాలమ్మ

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మకు శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు సమర్పించిన శనగకాయలు, కర్జూరా లను అమ్మవారికి దండలుగా కూర్చి అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే కనకాచలంపై వెలసిన కనక దుర్గమ్మకు రాహుకాల అభిషేకం జరిగింది. కొత్తపేటలో శీతాలాంబ ఆలయంలో విశేషపూజలు జరిగాయి.

పుత్తూరు వార్తలు

డీఎస్పీ రవికుమార్ బాధ్యతల స్వీకరణ



పుత్తూరు, ఆగస్టు 9: పుత్తూరు డీఎస్పీగా రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతిలోని రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్సు డీఎస్పీగా ఉన్న బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ శ్రీనివాసరావు సీఐడీకి వెళ్లారు.

తహసీల్దారుగా వెంకటేశ్వర్లు



తహసీల్దారు వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పుత్తూరు, ఆగస్టు 9: పుత్తూరు తహసీల్దారుగా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దారు శ్రీనివాసగౌడ్ నంద్యాలకు వెళ్లారు. కొత్త తహసీల్దారును డీటీ సురేష్‌రెడ్డి, ఆర్‌ఐ గురుస్వామి, వీఆర్వోలు శాలువా కప్పి సన్మానించారు. కాగా, వెంకటేశ్వర్లు పుత్తూరు తహసీల్దారుగా నియమితులవడం ఇది రెండో పర్యాయం.

బుద్దదేవ్ భట్టాచార్య మృతికి నివాళి

పుత్తూరు టౌన్, ఆగస్టు 9: సీపీఎం సీనియర్ నాయకుడు, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్దదేవ్ భట్టాచార్య మృతికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం పుత్తూరు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు ఆర్.వెంకటేష్, విజయ్, రమేష్, గోవిందస్వామి, సుధాకర్, కృష్ణయ్య తదితరులు బుద్దదేవ్ భట్టాచార్య చిత్రపటానికి నివాళులర్పించారు.

దక్షిణ రైల్వే కన్సల్టేటివ్ సభ్యుడిగా సుబ్రహ్మణ్యంరాజు



స్టేషన్ మాస్టర్ నుంచి మెంబర్‌షిప్ కార్డు అందుకుంటున్న సుబ్రహ్మణ్యంరాజు

వడమాలపేట, ఆగస్టు 9: వడమాలపేట మండలం ఎస్‌వీపురం పంచాయతీ కేఆర్ కోటాల గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరాజు దక్షిణ రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. శుక్రవారం పుత్తూరు రైల్వే స్టేషన్ మాస్టర్ పంకజ్ నాయక్ మెంబర్ షిప్ కార్డును సుబ్రహ్మణ్యం రాజుకు అందజేశారు. బీజేపీ సీనియర్ నేత అయిన సుబ్రహ్మణ్యంరాజు పార్టీలో జిల్లా స్థాయిలో పలు పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ రైల్వే పరిధిలోని రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు జగదీష్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: శ్రీకాళహస్తి పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్, 11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వరదయ్యపాళెం: స్థానిక పంచాయతీ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివప్రసాద్ తెలిపారు.

రేణిగుంట: మండలంలోని తూకివాకం, కరకంబాడి, గురవరాజుపల్లి, యలమండ్యం, గాజులమండ్యం, కుర్రకాలువ సబ్‌స్టేషన్ల పరిధిలో 11 కేవీ, ఎల్‌టీ లైన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ డీఈఈ ప్రభాకర్ తెలిపారు.

శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా గోపి



శ్రీకాళహస్తి, ఆగస్టు 9: శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా గోపి నియమితులయ్యారు. ఈయన కర్నూలు ఎస్పీ కార్యాలయ వీఆర్ నుంచి శ్రీకాళహస్తికి బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా ఉన్న ఎస్వీ నరసింహారావును వీఆర్‌కు బదిలీ చేశారు. కాగా, సీఐ గోపి గతంలో కేవీబీపురం, వెదురుకుప్పం, తిరుపతి స్పెషల్ బ్రాంచిలో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు.

రేణిగుంట తహసీల్దారుగా సురేష్‌బాబు



రేణిగుంట, ఆగస్టు 9: రేణిగుంట తహసీల్దారుగా సురేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రాపురం తహసీల్దారు వెంకటేశ్వర్లును ఇక్కడకు బదిలీ చేయగా ఆయన బాధ్యతలు స్వీకరించకుండా సెలవుపై వెళ్లిపోయారు. దీంతో పుత్తూరు తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబును రేణిగుంటకు బదిలీ చేయగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

రేణిగుంట అర్బన్, రూరల్ సీఐల బదిలీ

రేణిగుంట, ఆగస్టు 9: రేణిగుంట అర్బన్, రూరల్ సీఐలు మల్లికార్జున్, సుబ్బరాయుడు బదిలీ అయ్యారు. వీరిద్దరినీ వీఆర్‌కు పంపారు. తిరుపతి మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న శరత్‌చంద్రను రేణిగుంట అర్బన్‌కు, తిరుపతి సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ మురళీకృష్ణను గాజులమండ్యం స్టేషన్‌కు బదిలీ చేశారు.

సీసీఎల్‌ఏకు స్వాగతం

రేణిగుంట, ఆగస్టు 9: చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జయలక్ష్మికి జిల్లా అధికారులు స్వాగతం పలికారు. విజయవాడ నుంచి శుక్రవారం తెల్లవారుజామున రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న జయలక్ష్మికి కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో పెంచలకిషోర్ స్వాగతం పలికారు.

ముక్కంటి సేవలో దక్షిణ మధ్య రైల్వే ఐజీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాగూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

వరదయ్యపాళెం, ఆగస్టు 9: వరదయ్యపాళెం మండలం సంతవేలూరులోని ప్రాథమిక పాఠశాలలో చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డైనమిక్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కంటికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి చెన్నైలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చే వారు తమ ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు తీసుకురావాలన్నారు.

బుద్దదేవ్ భట్టాచార్యకు నివాళి

రేణిగుంట, ఆగస్టు 9: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్యకు శుక్రవారం సీపీఎం నాయకులు నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుద్దదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటరమణ, హరినాథ్, ఈశ్వరి దిలీప్, బాషా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంజి సమర్పణ



గంజి సమర్పణకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నారాయణవనం, ఆగస్టు 9: మండల పరిధిలోని భీమునిచెరువు గ్రామంలో వెలసిన ఓంశక్తి అమ్మవారికి శుక్రవారం ఆడినెల సందర్భంగా మహిళా భక్తులు గంజి సమర్పించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహిళలు ఎర్ర చీరలు ధరించి, మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గంజిని ఊరేగింపుగా తీసుకుని వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

ఎస్‌ఎంసీ చైర్మన్‌కు సన్మానం

పిచ్చాటూరు, ఆగస్టు 9: పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు ఎస్‌ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన వినాయకంను ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి సన్మానించారు. టీడీపీ నాయకులు పద్దురాజు, వాసురెడ్డి, భక్తరెడ్డి, దొరవేలు, త్యాగరాజు, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 9: వ్యక్తి గత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో రవీంద్రబాబు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలో డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. కాలనీలోని నీటి ట్యాంకులను, మురుగు కాలువలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటమ్మ, ఉప సర్పంచు మునిరాజా, పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించకపోతే కఠిన చర్యలు: కలెక్టర్



వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 9: బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కనమనంబేడు ఏకలవ్య గురుకుల పాఠశాలను కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్, వార్డన్‌ను హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, స్నాక్స్, కోడిగుడ్లు సక్రమంగా ఇవ్వడం లేదని, రోజూ పప్పుకూర మాత్రమే వడ్డిస్తున్నారని, చికెన్ రెండు ముక్కలు వేస్తున్నారని, స్నానాలకు నీళ్ల లేవని, నీళ్ల పాలు, ఉడికి ఉడకని అన్నం పెడుతున్నారని, బాత్‌రూములలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, న్యాప్‌కిన్‌లు ఇవ్వడం విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు తెలుగు తెలియకపోవడంతో వారు బోధించే పాఠాలు అర్థంకాక చదవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు రోజు వారి మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను చెప్పాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అలాగే తాగునీరు, స్నానాలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. నెల రోజుల్లో పాఠశాలలో స్థితిగతులు మారకపోతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం, డీటీ చంద్రబాబు, ఎస్‌ఐ వెంకటనరసింహ పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, ఆగస్టు 9: నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై కృష్ణభగవానుడు

నారాయణవనం, ఆగస్టు 9: మండల కేంద్రంలోని ధర్మరాజస్వామి ఆలయం వద్ద జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కృష్ణ భగవానుడు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అమ్మవారిని, స్వామివార్లను అలంకరించారు. అర్జునుడు తపస్సుమాను ఎక్కి తపస్సు చేసే కార్యక్రమం చేపట్టారు. అర్జునుడు తపస్సు మాను నుంచి విసిరిన నిమ్మ పండ్లు, పూలను మహిళలు అందుకున్నారు. సాయంత్రం గాండ్ల సంఘం ఆధ్వర్యంలో ఉత్తర గోకర్ణ యుద్ధ ఘట్టాన్ని ప్రదర్శించారు. ఆలయ ప్రాంగణంలో వివిధ వేషధారణలో ఉన్న వేషగాళ్లు, కేరళ సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయానికి సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చంద్రప్రభ వాహనంపై వీరభద్రుడు

నారాయణవనం, ఆగస్టు 9: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి శుక్రవారం శేష వాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. స్వామివారికి భద్రకాళీ సమేత వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించి, సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6.30గంటలకు ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. రాత్రి భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, ఆలయాధికారి నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి పంచాయతీ కొత్తూరు గ్రామంలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో శాంతిదుర్గ, సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు అమ్మాయిలకు, 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకు పెళ్లి చేయడం నేరమన్నారు. బాల్య వివాహాల వల్ల శారీరక ఎదుగుదల లేకపోవడంతో పాటు మాతా శిశు మరణాలు జరుగుతాయన్నారు. ఎవరైనా బాల్యవివాహాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించండి

కేవీబీపురం, ఆగస్టు 9: మండలంలోని రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం నాయకుడు దాసరి జనార్దన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కేవీబీపురం తహసీల్దారు దస్తగిరయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ దేశంలో ప్రజల సంపదను కార్పొరేట్ సంస్థలు కొల్లగొడుతున్నాయని చెప్పారు. రైతులకు మేలు చేసేలా రుణ విమోచన చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, శంకరయ్య పాల్గొన్నారు.

భరతమాత చిత్రపటాల వితరణ



పాతవీరాపురం పాఠశాలకు భరతమాత చిత్రపటాన్ని అందజేస్తున్న ఆపస్ నాయకులు

ఏర్పేడు, ఆగస్టు 9: రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పేడు మండలంలో పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు భరత మాత చిత్రపటాలను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, సాంబిరెడ్డి, డాక్టర్ దేవరాజులు, నిరంజన్, వెంకటేశ్వర్లు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పచ్చాలమ్మకు పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 9: బుచ్చి నాయుడుకండ్రిగ మండలం పల్లమాల గ్రామంలోని పచ్చాలమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభి షేకాలు చేసి పూలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వివేకానందుడి జీవితంపై విద్యార్థులకు పోటీలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: శ్రీకాళహస్తి ఆర్‌పీబీఎస్ బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు వివేకానందుడి జీవితంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఆదర్శిని భారతమ్మ ఎల్లయ్య ట్రస్టు అధ్యక్షుడు మునిసురేష్‌పిళ్లై తెలిపారు. ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్వామి వివేకానంద జీవితం సందేశం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతి ప్రదానం ఉంటుందని ప్రధానపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరించండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: తొట్టంబేడు మండలంలో భూసమస్యలను పరిష్కరించాలని తహసీల్దారు మధుసూదనరావును సీపీఐ నాయకులు కోరారు. శుక్రవారం తహసీల్దారును కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ తొట్టంబేడు, కారాకొల్లు, బోనుపల్లి గ్రామాల్లో భూసమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని కోరారు. రౌతుసూరమాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు పాసు పుస్తకాలు ఇచ్చారని, అయితే గత ప్రభుత్వంలో రికార్డుల్లో లబ్ధిదారుల పేర్లను తొలగించారని, వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రుద్రపాక శ్రీనివాసులు, మించల శివకుమార్, ధనంజయులు, చంద్రశేఖర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నాగాలమ్మకు పొంగళ్లు

వరదయ్యపాళెం, ఆగస్టు 9: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీ పద్మావతిపురంలోని నాగాలమ్మకు గ్రామస్తులు శుక్రవారం పొంగళ్లు పెట్టారు. మొదట వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గోపూజ నిర్వహించారు. అనంతరం నాగాలమ్మకు విశేష పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కార్మికుడిపై దాడి



గాయపడిన బాలకృష్ణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: అడిగిన వెంటనే మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న ఆగ్రహంతో ఇద్దరు యువకులు రెచ్చిపోయారు. మద్యం సీసాలతో భవన నిర్మాణ కార్మికుడు తలపై కొట్టి దాడి చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున రామసేతు వంతెన వద్ద శుక్రవారం జరిగింది. బాధితుడి కథనం మేరకు... తొట్టంబేడు మండలం దయనేడు గ్రామానికి చెందిన బాలకృష్ణ(30) భవన నిర్మాణ కార్మికుడు. పనినిమిత్తం శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చాడు. మధ్యాహ్నం వేళ తోటి కార్మికులకు భోజనం తీసుకెళ్లేందుకు రామసేతు వంతెన సమీపంలోని ఓ హోటల్ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో పూటుగా మద్యం తాగిన ఇద్దరు యువకులు బాలకృష్ణను అడ్డగించి రూ.100 ఇవ్వాలని డిమాండ్ చేశారు. తనవద్ద డబ్బు లేదని బాలకృష్ణ చెప్పడంతో మద్యం సీసాలతో తలపై దాడి చేసి గాయపరిచారు. ఇంతలో బాలకృష్ణ స్థానికుల సాయంతో ఫోన్‌ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దాడి చేసిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించే క్రమంలో ఏం జరిగిందో కానీ మార్గమధ్యంలో వరదరాజస్వామి గుడి వద్ద విడిచిపెట్టేశారు. బాలకృష్ణ చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. దీనిపై కేసు నమోదు కాలేదు.

ఆరోగ్యం, విద్య అందరికీ ప్రధానం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: ఆరోగ్యం, విద్య ప్రతి ఒక్కరికీ ప్రధానమని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. పట్టణంలోని లంకమిట్టలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, విద్య తప్పనిసరి అంశాలని, మన ఆరోగ్యాన్ని మనమే జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఏదైనా న్యాయపరమైన సమస్య ఉంటే అర్జీ రాసి కోర్టులో అందజేస్తే ఉచిత సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ప్రజలు పెద్దసంఖ్యలో వైద్యశిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, పోలీసులు, కోర్టు సిబ్బంది, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.